క్లుప్తంగా

## సత్తుపల్లి రేంజర్‌గా స్నేహలత


స్నేహలతకు అభినందనలు తెలుపుతున్న వెంకటేశ్వర్లు

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి అటవీశాఖ రేంజర్‌గా పి.స్నేహలత సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న రేంజర్ వెంకటేశ్వర్లు అటవీశాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. దుబ్బాక రేంజర్‌గా పని చేస్తున్న స్నేహలత బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా రేంజర్ వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

**పెనుబల్లి:** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్, ఎంఈఓ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్, ఎంఈఓ కార్యాలయాలకు ర్యాలీగా చేరుకొని గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విఠల్‌రావు, తిరుపతిరావు, ధనలక్ష్మి, నేలమ్మ, దుర్గ, రాధమ్మ, రాములమ్మ, మాణిక్యమ్మ, సువర్ణ, నాగేశ్వరరావు, కమల పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన సెకండ్ ఏఎన్‌ఎంలు

**సత్తుపల్లిరూరల్:** రెగ్యులర్ చేయాలని 19 రోజులుగా సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు ప్రభుత్వం సమస్యలు పరిష్కరించేందుకు కమిటీ నియమించటంతో సోమవారం సమ్మె విరమించి విధుల్లో చేశారు. గంగారం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అవినాష్‌కు విధుల్లో చేరుతున్నట్లు లేఖను అందించారు. ప్రభుత్వం నెల రోజుల్లోగా సమస్యలు పరిష్కరించకుంటే మళ్లీ సమ్మె చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎంలు మంజుల, మిరియా, శాంతి ప్రియ, హైమావతి, సునీత, కృష్ణవేణి, లక్ష్మీ, రమాదేవి పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

**కారేపల్లి:** మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ ఖజానాను సీఎం కేసీఆర్ ఖాళీ చేశారని డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ విమర్శించారు. కారేపల్లిలో కాంగ్రెస్ బూత్ లెవల్ కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎడ్లపల్లి సంతోష్, దొబ్బల సౌజన్యతో పాటు బాలగంగాధర్, రాధాకృష్ణ, వీరప్రతాప్, సురేందర్ మణియార్, భీముడు, గోపాల్, నాగవేణి, రామ్మూర్తి, అప్సర్, హర్షానాయక్, జగన్, మజీద్‌పాషా, రాంబాబు, చాంద్‌పాషా, వీరభద్రం, తాజుద్దీన్, రమేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌దే అధికారం

**కొణిజర్ల:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని వైరా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు బానోత్ బాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని మల్లుపల్లి గ్రామంలో బాలాజీతో కలసి సర్పంచ్ బానోత్ పద్మావతి ఇంటింటికీ సోనియమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు రాయల పుల్లయ్య, ధర్మసోత్ సౌందర్య, కోటేష్, వెంకన్న పాల్గొన్నారు.

## ప్రజల చూపు బీజేపీ వైపు

**కారేపల్లి:** బీజేపీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని.. దేశ ప్రజలందరూ బీజేపీ వైపే చూస్తున్నారని వైరా నియోజకవర్గ నాయకుడు కృష్ణ రాథోడ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జాటోత్ మధునాయక్, తురక నారాయణ, అనీల్, కోటి, భరత్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## సంపత్‌కుమార్‌ను కలిసిన సుధాకర్

**సత్తుపల్లి:** ఏఐసీసీ సభ్యుడు సంపత్‌కుమార్‌ను సోమవారం హైద్రాబాద్ గాంధీభవన్‌లో సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్ కలిశారు. నియోజకవర్గంలో పార్టీ నిర్మాణం, బలాబలాలను వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పించేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# మూగ రోదన వినేదెవరు?

- అందని పశువైద్యం
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఖాళీల భర్తీకి చర్యలు శూన్యం


గ్రామాల్లో పాడిపశువులు



మూతపడిన చిన్న కోరుకొండి పశుఆరోగ్య ఉపకేంద్రం

**కల్లూరురూరల్:** మండలంలోని పశువైద్యశాఖలో వైద్యులు, సిబ్బంది లేక పోవటంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో పాడి పశువులకు సరైన వైద్యం అందుబాటులో లేక పోవటంతో మూగ జీవాలు రోదనకు గురౌతున్నాయి.

**పాల ఉత్పత్తిలో కల్లూరు ముందంజ..**

పాల ఉత్పత్తిలో కల్లూరు మండలం ఖమ్మం జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంది. రోజుకు సుమారు 40వేల లీటర్లు పైగా పాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇక్కడి పాలు హైదరాబాద్, విజయవాడ, వరంగల్ తదితర నగరాలకు సరఫరా అవుతుంటాయి. గణనీయంగా పాలు ఉత్పత్తి చేస్తున్న పశువుల ఆరోగ్యంపై రైతులు అత్యంత జాగ్రత్తగా ఉంటారు. కల్లూరులో గేదెలు, దున్నలు 23వేలు, తెల్లపశువులు 3,600 వరకు ఉన్నాయి. ఇంత పెద్దసంఖ్యలో పశువులు ఉన్నా.. పశువులకు వైద్యం అందించడానికి వైద్యులు, సిబ్బంది లేకపోవడం దారుణం.

**గోపాలమిత్ర ఉన్నా.. అందని వైద్యం**

గోపాలమిత్రలు ఉన్నా వైద్యం మాత్రం అందడం లేదు. గోపాల మిత్ర సేవలు కేవలం పశువైద్యులు, శిక్షణ పొందిన సిబ్బంది, వెటర్నరీ అసిస్టెంట్‌లకు సహాయకులుగా మాత్రమే ఉపయోగపడతారు. శిక్షణ పొందిన పశువైద్య సిబ్బంది లేకపోవడంతో అర్హతలు లేకపోయిన గోపాల మిత్రలు పశువులకు వైద్యం చేస్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి పట్టింపే లేకుండా పోయింది.

**ఏడేళ్లుగా లేని నోటిఫికేషన్..**

ప్రభుత్వం అన్ని శాఖల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ.. వెటర్నరీ శాఖలో మాత్రం గత 7సంవత్సరాలుగా నోటిఫికేషన్ ఇవ్వడం లేదు. దీంతో పశువైద్య శాస్త్రం చదివి, శిక్షణ పొందిన అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురౌతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ప్రభుత్వం ఎన్నికల సన్నద్ధత, మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి రావటానికి ప్రయత్నాలు చేస్తుందే తప్ప, ఖాళీల భర్తీ గురించి పట్టించుకోవటం లేదని అభ్యర్థులు వాపోతున్నారు.

**ఖాళీలు భర్తీ చేయాలి..**



పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి. గ్రామాల్లో రైతులు ఎక్కువ శాతం పాల ఉత్పత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. పశువులకు అనారోగ్యం చేస్తే, చికిత్స చేసేందుకు సిబ్బంది లేరు. వెంటనే ఖాళీలను భర్తీ చేయాలి. పాడి రైతులకు ప్రోత్సహకాలు అందించాలి.

– రంగు లక్ష్మణ్‌రావు, పాడిరైతు, పుల్లయ్య బంజరు

## ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి అవార్డులు


అత్తునూరు శాంతారెడ్డి


వెంకటేశ్వరరావు


శ్రీనివాసచారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

**వైరా/వైరారూరల్ :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఇద్దరు ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కాయి. వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అత్తునూరు శాంతారెడ్డి, సీపీఎస్ వైరా(గుట్టబడి)కి చెందిన రామడుగు శ్రీనివాసచారి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అదే విధంగా వైరా మండలంలోని విప్పలమడక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి వెంకటేశ్వరరావు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన పాఠశాలలోని విద్యార్థులను పలు పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లి విజ్ఞాన విషయాలపై అవగాహన కల్పించారు. వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు అందిచడమే కాకుండా.. దాతల సహకారంతో బట్టలు పంపిణీ చేశారు. గత 23 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతో మంది విద్యార్థులకు తన విద్యా బోధనలు, సేవా కార్యక్రమాలతో అండగా నిలబడి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన దాసరిని పలువురు అభినందించారు.

**ఉపాధ్యాయుల సంఘాల ఆధ్వర్యంలో సత్కారం..**

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయుడికి అన్ని మండలాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు. నిత్యం విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ ఆంగ్ల బోధనలతో చిన్నారులకు తర్ఫీదు ఇవ్వడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగబత్తిన భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు జీవీ సూర్యప్రకాశరావు, దొడ్డా వరప్రసాదరావు, వెలిశెట్టి నరసింహారావు, సుధాకర్, ఉపేందర్‌రావు, జాన్, పలువురు ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


కల్లూరు: తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న అంగన్‌వాడీలు

**కల్లూరు/సత్తుపల్లిరూరల్:** సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు సమ్మె బాట పట్టనున్నారు. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లు సోమవారం కల్లూరు తహసీల్దార్ బాబ్జీప్రసాద్‌కు సమ్మె నోటీస్ అందించారు. అదే విధంగా సత్తుపల్లిలోని టీచర్లు తహసీల్దార్ యోగీశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించి పని భారం తగ్గించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 11 నుంచి సమ్మె చేపడతామని ఆ సంఘ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వాణిశ్రీ, జ్యోతి, ప్రభావతి, శ్రీదేవి, సీఐటీయూ నాయకుడు సర్వేశ్వరరావు, ఉదయ్‌శ్రీ, షఫీన, కమల, సత్యవేణి, విజయలక్ష్మి, రజిని, పద్మ, నాగలక్ష్మి, రామలక్ష్మి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోగ్ బండారో


రంగంబంజరలో సేవాలాల్ మహారాజ్‌కు పూజలు చేస్తున్న దర్మసోత్ దశరథ్ నాయక్, తదితరులు

**తల్లాడ:** మండలంలోని రంగంబంజర గ్రామంలో సోమవారం బోగ్ బండారో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడీలు సాంప్రదాయ పద్ధతిలో జెండా పండుగను నిర్వహించారు. ముందుగా లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి బోగ్ బండారో కార్యక్రమం జరుపుకున్నారు. అనంతరం మేరమ్మ యాడీకి పూజలు చేశారు. తెలంగాణలో వర్షాలు బాగా కురవాలనీ, పంటలు పండాలనీ, పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని సేవాలాల్ మహారాజ్‌ను పూజించారు. ఈ కార్యక్రమంలో దర్మసోత్ దశరథ్‌నాయక్, దాలీబాయి, బిక్యా నాయక్, శంకర్ నాయక్, చిన్నబాయి, శ్రీను నాయక్, బీబీ బాయి, కోటమ్మ బాయి, హని నాయక్, సైదానాయక్, సిందూ బాయి, స్రవంతి, నాగేష్ పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ


పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ పుల్లారెడ్డి

**ఎర్రుపాలెం:** మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని శ్రీసరస్వతీ గ్రంథాలయానికి.. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ హనుమాండ్ల జాన్సీలక్ష్మి – రాజేందర్ రెడ్డి దంపతులు రూ.50 వేల విలువైన పుస్తకాలను వితరణ చేశారు. దాతలు అందించిన పుస్తకాలను స్థానిక సర్పంచ్ పుల్లారెడ్డి, వేమిరెడ్డి రామిరెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి, మర్రి భూమయ్యలు.. గ్రంథాలయాల జిల్లా సెక్రటరీ మంజుల వాణి, స్థానిక లైబ్రేరియన్ శ్రీనివాస్‌కు అందించారు. కార్యక్రమంలో శీలం భీష్మారెడ్డి, పవన్, వంశీ, జగదీష్‌లు ఉన్నారు.

## ప్రధాన రహదారిపై వీరంగం

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై సోమవారం హిజ్రా వేషధారణలో ఉన్న ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. మద్యం మత్తులో ఉన్న ఆయన వాహనాలను ఆపుతూ అలజడి చేశాడు. మద్యం మత్తులో ఉన్న వాహనాదారులను దుర్భాషలాడుతూ ఉండటంతో పోలీసు సిబ్బంది మందలించి పంపివేశారు. కాగా, తన స్వస్థలం చింతలపూడి అని తెలిసింది.

## ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**చింతకాని:** మండలంలోని చినమండవ మున్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చినమండవ మున్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు బ్లూకోల్ట్ కానిస్టేబల్ జి. శ్రీనివాసరావుతో కలిసి.. ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగించామని, మున్నేరు పరిసర ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం


సత్యలీనాను సత్కరిస్తున్న అధ్యాపకులు

**వైరా:** వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ చదివిన సత్యలీనాకు నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించగా, కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు లభించింది. ఈ సందర్భంగా సోమవారం అధ్యాపకులు ఆమెను సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ప్రైవేట్ కాలేజీల విద్యార్థులకు దీటుగా ర్యాంకు సాధించడం అభినందనీయమయ్యారు. అధ్యాపకులు వీరభద్రరావు, అనీల్‌కుమార్, శ్రీని వాసరావు, డాక్టర్ సురేష్, శ్రీకాంత్, రోషన్‌బీ, వెంకటముత్యం, మధు, కవిత, సుధాకర్, బాపూరావు, నాగసర్వేశ్వరరావు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

## సేవాభావం అలవర్చుకోవాలి


పుస్తకాన్ని అందజేస్తున్న విద్యార్థి నిరంజన్

**మధిర:** ప్రతీ విద్యార్థి చిన్నప్పటినుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని మధిర సీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ప్రభు దయాళ్ సూచించారు. సీపీఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ పుట్టినరోజు సందర్భంగా వారి గుర్తుగా ఒక పుస్తకాన్ని పాఠశాల గ్రంథాలయానికి బహుకరించే సాంప్రదాయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. దీనిలో భాగంగా పుట్టినరోజు జరుపుకుంటున్న నిరంజన్ అనే విద్యార్థి పాఠశాలకు విజ్ఞాన పుస్తకాన్ని అందించాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మాట్లాడుతూ.. పుట్టిన రోజు సందర్భంగా డబ్బులను వృథా ఖర్చులు చేయకుండా అందరికీ ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు.

## ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి..

**సత్తుపల్లి:** ఓయూ విద్యార్థి ఉద్యమకారులకు కాంగ్రెస్ నుంచి టిక్కెట్లు ఇస్తామన్న రాహుల్‌గాంధీ హామీని నిలబెట్టుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి కోటూరు మానవతారాయ్ కోరారు. ఈమేరకు హైదరాబాద్ గాంధీభవన్‌లో సోమవారం తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కె.మురళీధరన్‌కు ఆయన ఓయూ ఉద్యమ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఉద్యమకారులకు రెండు టికెట్లు ఇస్తానని రాహుల్‌గాంధీ గతంలో చెప్పారని తెలిపారు. బీఆర్‌ఎస్ 2014లో ఒక ఎంపీ, మూడు అసెంబ్లీ టికెట్లు ఉద్యమకారులకు, 2018లో మూడు అసెంబ్లీ టికెట్లు, 30 కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఇచ్చినందున కాంగ్రెస్ కూడా న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రంలో ఇచ్చిన వారిలో మానవతారాయ్‌తో పాటు దుర్గం భాస్కర్, బాల లక్ష్మి, కురువ విజయ్‌కుమార్, లోకేష్ యాదవ్, కేతూరి వెంకటేష్, పూనా కైలాష్, డాక్టర్ లింగం యాదవ్, కొనగాల మహేష్, పందుల రవి తదితరులు ఉన్నారు.

# పేదల పక్షపాతి సీఎం కేసీఆర్


బోనకల్: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న జెడ్పీచైర్మన్ కమల్‌రాజ్

**బోనకల్:** సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండలంలోని బోనకల్ గ్రామంలో 8 మంది లబ్ధిదారులకు సోమవారం రూ. 2.80 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం బాగాలేక, ఆస్పత్రుల బిల్లులు చెల్లించలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమన్నారు. అభిచేస్తున్న కేసీఆర్‌ను మరోమారు గెలిపించుకోవాలన్నారు. మధిర నియోజకవర్గంలో ఎక్కువ సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేయడం నా అదృష్టంగా బావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బందం శ్రీను, మండలాధ్యక్షుడు చేబ్రోలు మల్లిఖార్జున్, బానోత్ కొండ, వేమూరి ప్రసాదు, కంచర్ల బాబు, పారా ప్రసాద్ పాల్గొన్నారు.

**ఎర్రుపాలెం:** మండలంలోని సఖినవీడు గ్రామంలో సోమవారం నారాయణపురం, ఎర్రుపాలెం, రేమిడిచర్ల తదితర గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు పంబి సాంబశివరావులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యరమల భాస్కరరెడ్డి, ఎంపీటీసీ సూరానేని రామకోటేశ్వరరావు, నాయకుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


ట్రాన్స్‌జెండర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ వసంత్ కుమార్

**మధిర:** ఇతరులకు ఇబ్బంది కలిగిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మధిర సీఐ జె.వసంత్ కుమార్ అన్నారు. మధిర పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ట్రాన్స్‌జెండర్లకు అవగాహన కల్పించారు. గృహప్రవేశాలు, వివాహ తదితర శుభ కార్యక్రమాల సందర్భంగా బలవంతపు వసూళ్లకు పాల్పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు, ఇంటి యజమానులు, బంధువులు అభిమానంతో వారు ఏదైనా బహుమతులు ఇస్తే తీసుకోవచ్చునని, కానీ బ్లాక్ మెయిల్ చేసి, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అదే విధంగా ఆత్కూరు క్రాస్ రోడ్, మాటూరు క్రాస్ రోడ్, దెందుకూరు రైల్వే ఓవర్ బ్రిడ్జి, నిధానపురం క్రాస్ రోడ్, మధిర బస్టాండ్, రైల్వే స్టేషన్, రైల్వే ఓవర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మధిర పోలీస్ సర్కిల్ పరిధిలో ఇటువంటి విషయాలకు సంబంధించి ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ప్రభుత్వాల తీరును ఎండగట్టాలి


మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

**చింతకాని:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం చింతకానిలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ.. సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో మతతత్వ బీజేపీ, అవకాశవాద బీఆర్‌ఎస్ ప్రభుత్వాలను గద్దె దించాలని తెలిపారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా పెరిగిన ధరలను వ్యతిరేకిస్తూ గ్రామాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని, అలాగే ఈ నెల 10వ తేదీ నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కమిటీ సభ్యులు జానికిరాములు, వెంకటనర్సయ్య, కృష్ణమూర్తి, రమణ, రవి, రాచబంటి రాము, మద్దిని బస్వయ్య, దేశబోయిన ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల వెంటే మా పయనం


మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో తల్లాడ నాయకులు

**తల్లాడ:** మండలంలోని పలువురు నాయకులు సోమవారం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. గండుగులపల్లిలోని ఆయన నివాసంలో కలిసి తాను తీసుకోబోయే ఏ నిర్ణయానికైన కట్టుబడి ఉంటామని తీర్మానించారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బిల్లుపాడులో సమావేశమై.. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తుమ్మలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జక్కంపూడి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిలో చెరగని ముద్ర వేసుకున్న తుమ్మల మంత్రిగా రాష్ట్రానికి సుపరిచితులనీ, తాను తీసుకోబోయే నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావం చూపుతుందన్నారు. జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుందేటీ వీరారెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వరరావు, గుర్రం శ్రీనివాసరావు, మారెళ్ల మల్లిఖార్జున్‌రావు, పాసంగుల పాటి లక్ష్మీనారాయణ, కోడూరి రాము, సామినేని రామఅప్పారావు, రాయల లక్ష్మయ్య, ఇంజం వెంకటయ్య, మూకర ప్రసాద్, కోటయ్య పాల్గొన్నారు.

## మేడేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**ముదిగొండ:** మండలంలోని మేడేపల్లిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సోమవారం ప్రారంభించారు. శిబిరంలో వయోవృద్ధులకు, దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వెలిగేటి చంద్రమోహన్, ఉపసర్పంచ్ రమేష్, రెడ్‌క్రాస్ వయోవృద్ధుల సంఘం ప్రతినిధులు సాధినేని జనార్ధన్, సూర్యప్రకాశరావు, వెంకటేశ్వర్లు, డాక్టర్ నరసింహారావు, హరినాథ్‌బాబు, డాక్టర్ ముజీబ్, సాయి, ఉప్పలయ్య పాల్గొన్నారు.

**కందుకూరులో..**

**వేంసూరు:** మండలంలోని కందుకూరులో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో పెరుగుతున్న రోగాల దృష్ట్యా.. పలువురు నాయకులు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. హెటిరో డ్రగ్ అధినేత, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి అందించిన మందులను వైద్య శిబిరంలోని రోగులను అందించడం జరిగింది.

## 'నా మట్టి.. నా దేశం'కి అపూర్వ స్పందన


రేజర్లలో మట్టిని సేకరిస్తున్న నంబూరి రామలింగేశ్వరరావు

**సత్తుపల్లి:** నా మట్టి.. నా దేశం కార్యక్రమంలో ప్రజలు పాల్గొని మట్టిని అందిస్తున్నారని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని రేజర్లలో మట్టిసేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, భాస్కర్ల వీరంరాజు, సుదర్శన్‌మిశ్రా, కృష్ణస్వామి, శివ పాల్గొన్నారు.

## మల్లవరంలో పోషకాహార వారోత్సవాలు


మల్లవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**తల్లాడ:** మండలంలోని మల్లవరం గ్రామంలో సోమవారం పోషకాహార వారోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ రకాల పండ్లు, పిండి పదార్థాలతో చేసిన వంటకాలను ప్రదర్శించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

**చిన్నారులకు అక్షరాభ్యాసం..**

**వైరారూరల్:** మండలంలోని గొల్లపూడి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 7 నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు టీహెచ్‌ఆర్ పంపిణీ చేశారు. అనంతరం బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హెచ్.కనకతార, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్. బీజాన్‌బీ, అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి, మనోజ తదితరులు పాల్గొన్నారు.